జీవో 31 వెంటనే రద్దు చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - విశాఖ : రాష్ట్రవ్యాప్తంగా గూడ్స్ లారీలు, ప్రైవేటు బస్సులు, వ్యాన్లు, కార్లపై భారీగా పన్నులు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 31ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అక్కయ్యపాలెం జంక్షన్‌లో ధర్నా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ మోటార్ వాహనాలపై భారీగా పన్ను పెంచుతూ విడుదల చేసిన జీవో నెంబర్ 31 వెంటనే రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి పథకం కింద ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల నుండి అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని లారీలు, కార్లు, జీపులు, వ్యాను లు కొనుగోలు చేసి ప్రజలకి సేవలు అందిస్తూ ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తున్న వాహన యజమానులకు, డ్రైవర్లకు, క్లీనర్లకు బతుకులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో రద్దు చేయని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావికృష్ణ, కే శివ, కే రాము, జి శ్రీను, అప్పలరాజు పాల్గొన్నారు.

నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటాం

విశాలాంధ్ర - రంపచోడవరం : పోలవరం ప్రాజెక్టు ముంపు గిరిజన బాధితులను అభివృద్ధి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగు తుందని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సివి ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటిడిఏ కార్యాలయ సమావేశపు హాలులో రంపచోడవరం. చింతూరు డివిజన్లో పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురైన గిరిజన బాధితుల పొలాలు అభివృద్ధి. యువతకు ఉపాధి అవకాశాలు. వివిధ రకాలైన వ్యాపారాలు చేసుకొనుటకు రుణాలు మంజూరు తదితర అంశాలపై ఐటీడీఏ ఏపీవోతజనరల్తో వెలుగు ఏపి డి. వెలుగు డిపియం. వెలుగు ఏపి ఎంలు. సిసిలతో అగ్రికల్చరల్. హార్టి కల్చర్. అధికారులతో తాసిల్దార్‌లు. ఎంపీడీవోలు. అగ్రికల్చరల్ అసిస్టెంట్లతో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే. రంప చోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ ఇరువురు కలిసి సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ రంప చోడవరం. చింతూరు డివిజన్ లలో పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన సుమారు 5 వేల ఎనిమిది వందల గిరిజన కుటు ంబాలను ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ద్వారా ఆర్అండ్ఆర్ కాలనీలలో నివాసం ఉంటు న్న వారికి అభివృద్ధి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ ప్రాజె క్టులో ల్యాండ్ టు ల్యాండ్ తీసుకున్న గిరిజన రైతులు వ్యవసాయం చేయుచున్నది అదే విధంగా కౌలుకు ఇచ్చుచున్నది ఆయన ఆరా తీశారు. రైతులు పాత ఊర్లలో నెలకు ఎంత సంపాదించినాది అదే విధంగా ల్యాండ్ ల్యాండ్ ఇచ్చిన భూములలో ప్రస్తుతము నెలకు ఎంత సంపాదించుచున్నది ప్రతి ఇంటికి వెళ్లి రైతులను అడిగి తెలుసు కోవాలని ఆయన అన్నారు.

మత్స్యకారులకు అండగా టిడిపీ

టిడిపి రాష్ట్ర కార్యదర్శి

గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి : మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, అన్ని రంగాల్లో వారి వెనుకు బాటు తనానిక స్వస్తి పలికేవిధంగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుని కోరి, వినతి పత్రం సమర్పి స్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య అన్ని రంగాల్లో మత్స్యకారులు వెనుకబడి ఉన్నారని, వారిని ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేయను న్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం విశాఖపట్నానికి రానున్న సందర్భంగా అదే రోజు సాయంత్రం పెందుర్తిలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొంటారని, గురువారం ఉదయం 10 గం. లకు జిల్లాలో ఉండే మత్సకారులతో ముఖాముఖి కార్యక్రమంలో అధినేత పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం ఉందని, 9 జిల్లాలో సుమారుగా 600 లకు పైగా గ్రామాల్లో మత్స్యకారులు జీవిస్తున్నారని అన్నారు. మత్స్యకారుల స్థితిగతులపై 1955 సంవత్సరంలో కాకా సాహెబ్ కాలేల్కర్ వెనుకబడిన తరగతుల అధ్యయన కమిటీని నియమించిందని అన్నారు. 1965లో టి. ఎస్. ల్కోరీర్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సిపారసుల కమిటీని నియమించిందని, అదే విధంగా 1967లో అనిల్ కె. చంద్ అధ్యక్షతన వేసిన కేంద్ర కమిటీ, 1977లో బిసి మండల కమీషన్ కూడా మత్సకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సూచించాయని అన్నారు. మత్స్యకారులకు న్యాయం జరగాలంటే నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని గంటా నూకరాజు ఆశాభావం వ్యక్తం చేసారు.

వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయం

చంద్రబాబుతో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

విశాలాంధ్ర బ్యూరో - అల్లూరి జిల్లా : రాబోయే ఎన్నికలలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ వ్యాఖ్యానించారు. గురువారం ఉదయం మీనాక్షి కన్వెన్షన్స్‌లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని కలిసిన అనంతరం బి.వి.రామ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో విసిగి వేసారి పోయారన్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా మండు వేసవిలో కూడా మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం వినేందుకు వేల సంఖ్యలో ప్రజలు తరలి వస్తున్నారన్నారు. ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా వ్యవహరిస్తే మేలని పేర్కొన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు తీసుకువచ్చిన జీవో నెంబర్ 1ని రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానానికి చెంప పెట్టని అన్నారు.చంద్రబాబు నాయుడు హయాంలో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తే వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో అప్పులు చేస్తేనే గాని.. రోజులు గడిచే పరిస్థితి లేదన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అటు ఉద్యోగులతో పాటు నిరుద్యోగులు కూడా వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పై తీవ్ర ఆక్రోశంతో ఉన్నారన్నారు .

21న అఖిలభారత ఆదివాసీ జాతీయ సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : గిరిజనులపై పెరుగుతున్న దాడులను ఎదుర్కొ నేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ సంఘాల నాయ కులతో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.రామ్మోహన్ తెలిపారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఉదయం సదస్సుకు సంబంధించి పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ ఈనెల 21న డాబాగార్డెన్స్ అల్లూరి సీతరామరాజు విజ్ఞాన కేంద్రం వేదికగా జరగనున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, జార?ండ్, పశ్చిమ బెంగాల్, బీహార్, యుపీ, త్రిపుర, మణిపూర్ నుంచి ఆదివాసీ సంఘాల నాయకులు సుమారు 750 మందికి పైగా పాల్గొంటారన్నారు. ఆదివాసీ రచయిత, పాత్రికేయురాలు జార?ండ్ మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ కిరో, అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట రామయ్య, న్యాయవాది త్రినాధరావు, కేంద్ర ఇంధన శాఖ మాజీ సెక్రటరీ ఇఏఎస్ శర్మ తదితరులు సదస్సులో ప్రసంగిస్తారన్నారు. భారతదేశం నలుమూలల నుంచి ఆదివాసీ సంఘాల నాయకులను ఒక ఫోరమ్ లోకి తీసుకురావడానికి ఈ సదస్సు కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు డి.సురేష్, ముక్తి సత్యం, జయలక్ష్మి, భూషణం, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అడ్డతీగల : అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామంలో వాల్మీకి పేటలో అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాల వారిని రంపచోడవరం శాసన సభ్యురాలు నాగులపల్లి ధనలక్ష్మి గురువారం పరామర్శించారు వారికి తక్షణ సహాయం కింద బియ్యం కూరగాయలు బట్టలు వంట సామగ్రి ఆర్థిక సహాయం చేశారు ఈ కార్యక్రమంలో అడ్డతీగల జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు యాల్లవరం సొసైటీ అధ్యక్షులు తోట రాజేశ్వరరావు వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

మాకవరపాలెం - విశాలాంధ్ర : మాకవరపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పదవ రోజున విద్యార్థిని విద్యార్థులకు ఇంగ్లీష్ స్పీకింగ్ మరియు నీతి కథలు చెప్పే కార్యక్రమం నిర్వహించబడింది అని గ్రంథాలయం అధికారి చంద్రకళ అన్నారు.ఈ కార్యక్రమంలో 22 మంది విద్యార్థులు పాల్గొనగా ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ ఆర్ రాజేష్ కుమార్ , పి. భాస్కర్, వ్యవహరించారు.రాజేష్ విద్యార్థులకు డ్రాయింగ్ చిత్రపటనం పిట్టకదలు నేర్పించారు. గ్రంథాలయ అధికారి చంద్రకళ ఆధ్వర్యంలో పిల్లల కోసం ఐస్ క్రీమ్ పంపిణీ చేయడం జరిగింది.

సంస్కృత శ్లోకాలు పఠనం

విశాలాంధ్ర - సింహాచలం : గ్రేటర్ విశాఖ 98అడవివరం శాఖ గ్రంథాలయంలో సంస్కృత శ్లోకాలు పఠనం కార్యక్రమం జరిగింది. అడవివరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురు వారం, శ్లోకాలు పఠనంపై శిక్షణను సింహాచలం దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు గొడవర్తి సీతారామాచార్యులు వల్లించి శిక్షణ ఇచ్చారు. సంస్కృత శ్లోకాలు అధ్యయనంతో భాష, భావం, సులభతరమ వుతుందన్నారు. రీసోర్స్ పర్సన్ లు గా విచ్చేసిన యోగ విజ్ఞాన సమితి వ్యవస్థాపకులు బి.బి.రాజేంద్ర ప్రసాద్, కార్మిక నేత జి.సూర్యనారాయణరాజులు విద్యార్థులకు, మెడిటేషన్, నీతి కథలు, నేర్పించారు. లైబ్రేరియన్ ఎన్.వి నరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిబ్బంది యల్లమ్మ, ఎవిఎస్ భాను పాఠకులు, బి.సూర్య మోహన్, మహేంద్ర, జి.కిరణ్ కాంత్, ఎం.అజయ్, జి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్, బిస్కెట్లు, అందజేశారు.

అసంపూర్తిగా దుమ్మగూడ - కోరాయి జంక్షన్ రోడ్డు

విశాలాంధ్ర - అరకులోయ : మండలంలో దుమ్ముగూడ నుంచి కోరాయి జంక్షన్ వరకు గత ఏడాది క్రితం నిర్మించిన రోడ్డు అసంపూర్తిగా ఉండటంతో ఆ ప్రాంతంలోని గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు.రోడ్డు నిర్మాణం ప్రారంభించి ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా ఉంది.. వర్షాకాలంలోలో రోడ్డు గుండా ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సి వస్తుందని గిరిజనులు వాపోతున్నారు. ద్విచక్ర వాహన దారులు ప్రయాణించేటప్పుడు పడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని అంటున్నారు.ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిన కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు అసంపూర్తిగా ఉండటంతో గిరిజనులకు కాలినడక భారం తప్పడం లేదు.తక్షణమే అసంపూర్తిగా ఉన్న రోజుల్లో పూర్తి చేయాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

23న సర్వ సభ్య సమావేశం

విశాలాంధ్ర. వి.ఆర్.పురం : ఈ నెల 23వ తేదీన మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశాలలో ఎంపీపీ కారం లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం, ఉదయం 8 గంటలకు నిర్వహించబడునని ఎం పి డి ఓ, ఎం రత్నకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశమునకు అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో, ప్రజా ప్రతినిధులుతగు సమాచారముతో తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

పెద్దప్పతల్లి అమ్మవారిని దర్శించుకున్న పప్పల చలపతిరావు

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్ : మున్సిపాలిటికి చెందిన 22వ వార్డు కొక్కిరాపల్లి అగ్రహారంలో గురువారం నాడు జరిగిన గ్రామ దేవత పెద్దప్పతల్లి అమ్మవారి పండుగ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు,మాజీ పార్లమెంటు సభ్యులు పప్పల చలపతిరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆయనతో పాటుగా పట్టణ పార్టీ అధ్యక్షులు గొర్లె నానాజీ, గ్రామ కమిటీ సభ్యులు గొర్లె వెంకట్ శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జ్ బోద్దపు శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షులు,నమ్మి రమణ, ఐటీడీపీ పెయ్యల రామకృష్ణ,గుర్రాల రాము,గొర్లి దుర్గాప్రసాద్,వి.. రాఘవరావు,వి. కోటిబాబు, సుబ్బయ్య నాయుడు, గుర్రాల లక్ష్మణ్ , అజయ్, ఎం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందాలి

విశాలాంధ్ర - రాంబిల్లి : మండలంలో గోవిందపాలెం సచివాలయం కొత్తపేట గ్రామంలో యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు యు.వి రమణమూర్తి రాజు (కన్నబాబు) మాజీ డిసిసిబి చైర్మన్ యు.సుకుమార్ వర్మ (తేజ) గురువారం నాడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్ళి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధి గురించి వివరిస్తూ అర్హత ఉండి ఇంకా ఏమైనా పథకాలు అందలేదా అని ప్రజలను అడిగి తెలుసుకుని అర్హులైన వారికి తక్షణమే ఆ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాధికారులను ఆదేశించారు. కొత్తపేట గ్రామంలో తడలవు లక్ష్మీ సత్యవతి అనే మహిళ కుటుంబ సభ్యులు ఎవరు లేక ఒంటరిగా జీవనం సాగిస్తూ ఇటీవల ప్రమాదవశాస్తు తన చెయ్యిని కోల్పోయి పనికి వెళ్ళలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సంగతి తెలుసుకున్న ఎమ్మెల్యే రూ.10,000,అలాగే అదే గ్రామానికి చెందిన వరహా పార్వతి అనే మహిళ అనారోగ్యంతో మంచానికే పరిమితమై ఆర్థికంగా పరిస్తితి బాగోలేదని తెలుసుకున్న రూ. 10000/-ఆర్థిక సహాయాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అచ్చుతాపురం,యలమంచిలి, రాంబిల్లి మండలాల ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 92 వ వార్డు వెంకటాపురం మూడు గుళ్ళు దగ్గర భగవాన్ శ్రీ రమణ మహర్షి ప్రేరణతో వంజిరపు రామకృష్ణ గారి సహకారంతో శ్రీ కుమారి కేటరింగ్ వారి పర్యవేక్షణలో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో చలివేంద్రం ప్రజలు దాహార్తిని తీర్చడానికి ఎంతో దోహదపడుతుందని, పాదచారులకు, వాహన దారులకు మంచినీళ్లు,మజ్జిగ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92 వ వార్డు అధ్యక్షులు జి. అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీకృష్ణ, ధవళ గోపాల్, కంపర సత్తిబాబు, గొంతెన నాగరాజు, ఇ.వి. రమణ, నీలాపు శ్రీనివాస్ రెడ్డి, రమేష్ రెడ్డి, దవల మోహన్, కంపర రామకృష్ణ, చిక్కాల బాబ్జి, రాము మాస్టర్, తెంటు రాము, శివాజీ, అభిరాం, అప్పలనాయుడు రామారావు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-ఆఫీస్ నిర్వహణలో దేశంలోనే రెండో స్థానంలో విశాఖపట్నం పోర్టు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : 2022-2023 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అత్యంత ప్రతిభావంతమైన డేటా గవర్నెన్స్ నాణ్యతా సూచిలో(డేటా గవర్నెన్స్ క్వాలిటీ ఇండెక్స్) కేంద్ర పోర్టులు షిప్పింగ్ , జలరవాణా మంత్రిత్వ శాఖ రెండో స్థానంలో నిలిచింది. నీతి ఆయోగ్ ఈ సర్వేను నిర్వహించింది. ఈ సర్వేలో 5 పాయింట్లకు గానూ కేంద్ర పోర్టులు షిప్పింగ్ జలరవాణా శాఖ 4.7 పాయింట్లను పొంది 66 శాఖల్లో రెండో స్థానంలో నిలిచింది. పాలనా వివరాల నిర్వహణలో మంత్రిత్వ శాఖ యొక్క నిబద్ధత, సమర్ధతను నీతి ఆయోగ్ లోని అభివృద్ధి పర్యవేక్షణ మరియు మూల్యాంకన కార్యాలయం ప్రత్యేకంగా ప్రశంసించింది. ఈ-ఆఫీస్ నిర్వహణలో కె అనలిటిక్స్ విభాగంలో ఈ గవర్నెన్స్ సూచీలలో ఏప్రిల్ 2023 గాను అన్ని మేజర్ పోర్టులలో విశాఖపట్నం పోర్టు అథారిటీ రెండో స్థానంలో నిలిచింది. ఈ ఘనతను సాధించడంలో సహకరించిన పోర్టు ఆపరేటర్లు, స్టివెడోర్స్ కు పోర్టు చైర్మన్ డా అంగముత్తు ధన్యవాదాలు తెలిపారు. మేజర్ పోర్టులలో పనిచేసే ఉద్యోగులు అధికారులు ప్రణాలికా బద్ధంగా నిబద్ధతో పని చేస్తే రాబోయే రోజుల్లో పోర్టులు షిప్పింగ్ జలరవాణా శాఖ అలాగే విశాఖపట్నం పోర్టు అథారిటీ సైతం మొదటి స్థానంలో నిలవవచ్చని విశాఖపట్నం పోర్టు చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

పంచాయతీల్లో పడకేసిన అభివృద్ధి : చంద్రబాబుకు మొర పెట్టుకున్న పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు దాడి

విశాలాంధ్ర - కె.కోటపాడు : గ్రామ పంచాయతీల్లో నిధులు లేక అభివృద్ధి పనులు చేయలేక పోతున్నామని, ఎన్నో ఆశలతో ఎన్నికైన సర్పంచులను జగన్ ప్రభుత్వం పూర్తిగా అణచివేసిందని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు దాడి ఎరుకు నాయుడు తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడుకు మొర పెట్టుకున్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఉత్తరాంధ్ర జిల్లాల కు వచ్చిన చంద్రబాబును గురువారం దాడి ఎరుకు నాయుడు వేప గుంటలో కలిసి సర్పంచుల సమస్యలను వివరించారు . కేంద్రం నుండి వచ్చే ఆర్థిక సంఘం నిధులు సర్పంచులకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం మళ్లించి గ్రామపంచాయతీలకు అన్యాయం చేసిందని అన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ఎన్నికైన సర్పంచులు ను ఉత్సవ విగ్రహాలుగా మార్చిందన్నారు. సర్పంచులు సొంత నిధులతో గ్రామాల్లో పనులు చేపడితే ఆ బిల్లులు ఇవ్వటానికి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారయిందని, తదితర అనేక అంశాలను చంద్రబాబుకు వివరించారు.

ఆకట్టుకున్న చిన్నారులు తయారుచేసిన కళాకృతులు

విశాలాంధ్ర - మల్కాపురం : గత పది రోజులుగా కొనసాగుతున్న వేసవి గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మల్కాపురం గ్రంథాలయంలో చిన్నారులు తయారుచేసిన కళాకృతులు అందరినీ ఆకర్షించాయి. ముఖ్యంగా జేసు మరియు ధనుష్ తయారు చేసిన లైట్ హౌస్, అజయ్ తయారుచేసిన ఇల్లు, ధనుష్, పర్వీన్ తయారుచేసిన గ్రీన్ హౌస్, జ్యోతిర్మయి, శ్రీ శాంత్, మాధవ్, రుత్విక్, లిఖిత్ తయారు చేసిన ఫేసు ఫ్రేమ్ బీసంతోష్ కుమార్, అభిరామ్ తయారుచేసిన ఫోటో ఫ్రేమ్, సమత, సునీత, సంజన, పర్వీన్ తదితరులు తయారుచేసిన బొకేలు, సిద్ధార్థ, జతిన్ తదితరులు తయారుచేసిన గ్రీటింగ్ కార్డులు మొదలైనవి ఆహుతులను అలరించాయి. వీటిని చిన్నారులు ఎంతగానో ఇష్టపడ్డారు. వీటిని తయారు చేయడానికి రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించిన వై. అనసూయదేవి , లావణ్య, అలేఖ్యలను అంతా ప్రశంసించారు.అనంతరం నీతి కథలను కార్మిక నాయకులు బి.సత్యానందం ఆసక్తికరంగా తెలియజేశారు. కె.సత్తిరాజు శిబిరా నిర్వాహకులను సత్కరించారు. ఈ క్యాంపులో సుమారు 50 మంది చిన్నారులు పాల్గొని పుస్తకాలను చదివారు. మొత్తం కార్యక్రమాలను గ్రంథాలయాధికారి వి. అజయ్ కుమార్ మరియు జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్ భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు.

యువతకు ఉపాధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రండి

చంద్రబాబుకు విన్నవించిన ఏఐవైఎఫ్ నాయకులు

విశాలాంధ్ర - పెందుర్తి : రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి. జాన్సన్ బాబు, విశాఖ జిల్లా కన్వీనర్ ఎర్రిపిల్లి రాంబాబు విన్నవించారు. పెందుర్తి నియోజకవర్గంలో పర్యటించిన చంద్రబాబును వారు కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో నిరుద్యోగ శాతం తీవ్రంగా పెరిగిపోతోందని, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ద్వారా భర్తీ చేస్తామన్న ఉద్యోగాలు గురించి ప్రభుత్వం పట్టించుకోలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలో రాగానే మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రకారం అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్న హామీని అటకెక్కించారని వెల్లడించారు. కొత్త పరిశ్రమలు లేక లక్షలాది మంది యువత ఖాళీగా ఉన్నారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను అన్నివిధాలా మోసం చేసిందని వెల్లడించారు. అవినీతి వైసీపీ ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు. మెగా డి.ఎస్.సి ప్రకటిస్తే వేలాది మందికి ఉద్యోగాలు వచ్చేవన్నారు. ఏటా ఉన్నత విద్యనభ్యసించి, టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన లక్షల మంది నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు కోసం నిరీక్షిస్తున్నారని చంద్రబాబుకు ఏఐవైఎఫ్ నాయకులు వివరించారు. వారిలో కొందరు బ్రతుకు తెరువు కోసం నైట్ వాచ్ మేన్ కార్మికులుగా పని చేస్తుండగా, మరి కొందరు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారి ఆయా వ్యాపార ముఠాల్లో చేరి దొంగతనాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలియచేసారు. పై విషయాలు మీకు విదితమే అని రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి రాష్ట్రంలోని లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పనకు కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు ఏఐవైఎఫ్ నాయకులు చంద్రబాబు కు విన్నవించారు.

వేమాంభిక అమ్మవారి పండుగ సందర్భంగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర - యలమంచిలి : చదువుతో పాటు క్రీడా రంగంలో కూడా రాణిస్తే ఆత్మస్థైర్యం పెరగడంతోపాటు ఉద్యోగ రీత్యా మంచి అవకాశాలు వచ్చి జీవితంలో స్థిరపడే అవకాశం ఉంటుందని శాసనసభ్యులు యూ.వి రమణమూర్తి రాజు (కన్నబాబు) అన్నారు. ఈ నెల 13వ తేదీ నాడు యలమంచిలి మున్సిపాలిటి పెదపల్లి గ్రామ దేవత శ్రీ వేమాంభిక అమ్మావారి పండుగ సందర్భంగా అమ్మవారి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే కన్నబాబు రాజు క్రికెట్ ఆడి ప్రారంభించారు. మొదటి బహుమతిగా ప్రకటించిన రూ.50 వేలను ఎమ్మెల్యే తన సొంతంగా ఇస్తాననడంతో నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ యూ.సుకుమార్ వర్మ తేజ, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాము కాటు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన

విశాలాంధ్ర - తగరపువలస : వివిధ రకాల పాములు వల్ల కలిగే విష ప్రభావాలను అనిల్ నిరుకొండ హాస్పిటల్ డాక్టర్స్ వివరించడం జరిగింది. ఇటీవల జరిగిన ఒక సంఘటనను గుర్తు చేస్తూ మే 12 వ తారీఖున మొల్లి బంగారయ్య అనే వ్యక్తికి మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పొలంలో ఉన్నప్పుడు ఎడమ కాలు మీద పాము కాటు వేయడం జరిగినది.విషయం తెలిసిన కుటుంబ సభ్యులు మరుసటి రోజు ఉదయం ఐదు గంటలకు అందుబాటులో ఉన్న అనిల్ నిరుకొండ హాస్పిటల్కు తీసుకునే వెళ్లడం జరిగినది. అప్పటికే పాము కాటు వల్ల నరాల్లోకి పాముకాటు విషం ఎక్కినట్లు డాక్టర్లు నిర్ధారించి క్యాజువాలిటీకి చేర్పించడం జరిగినది. నరాల్లో విషం ఎక్కటం వల్ల కళ్ళు వాలుపోవడం, మగతగా ఉండటం, శ్వాస తీసుకోవడం ఇబ్బంది కలగడం లాంటి లక్షణాలు కనిపించాయని వెంటనే విషయానికి విరుగుడు మొదలుపెట్టారు. శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవడం వల్ల కృత్రిమ శ్వాస అందించడం జరిగిందని అన్నారు . నాల్గవ రోజు విష ప్రభావం తగ్గుముఖం పట్టి సాధారణ స్థితిలోకి రావడం మొదలుపెట్టి తన పనులు తానే చేసుకోవడం ప్రారంభించా డని బంగారయ్యకు తర్వాత కృత్రిమ శ్వాస ఆపివేయడం జరిగినది అని ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎవరైనా సరే పాముకాటుకు గురైన వెంటనే నాటు వైద్యం చేయకుండా వెంటనే డాక్టర్ను సంప్రదించాలని అనిల్ నీరుకొండ డాక్టర్స్ తెలియజేశారు .కొన్ని రకాల పాముకాట్లు వల్ల పాము కాటు వేసిన దగ్గర గాయము ఎరుపు ఉంటుందని మరికొన్ని రకాల పాముల వల్ల రక్తస్రావం విపరీతంగా జరుగుతుందని మరికొన్ని రకాల పాముల విషయం వల్ల నరాలలోకి వెళ్తుందని ప్రమాదమని అన్నారు .అందువలన నాటు మందులు వాడకుండా పాముకాటుకు గురైన వ్యక్తిని అందుబాటులో ఉన్న హాస్పిటల్ కి వెంటనే తీసుకొని వెళ్లాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో మెడికల్ సూపరిటెండెంట్ డాక్టర్ ఏ.కృష్ణమూర్తి, హెచ్ఓడి డాక్టర్ కే.రామలక్ష్మి, చికిత్స చేసే డాక్టర్లు పి.సాయిశేఖర్, పి.శ్రీకాంత్, పి.విద్యాధర్, రాజేంద్రప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీ,మంత్రిని అరెస్టు చేయాలి

రాష్ట్ర మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

విశాలాంధ్ర - నర్సీపట్నం : నర్సీపట్నం ఆర్టీసీ డిపో ఎదుట రాష్ట్ర మహిళా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.నిరసన కార్యక్రమంలో మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి.సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఈ దేశానికి అవార్డు తెచ్చిపెట్టిన అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భారత స్టార్ మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపులు ఫిర్యాదును నమోదు చేయకుండా తిరస్కరించారు ఢిల్లీ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ దాఖలు చేయకుండా లైంగిక వేధింపులు గురైన మహిళలను చిన్నచూపు చూస్తున్నారు. మహిళా మల్లయోధులు 2023 జనవరిలో ఢిల్లీ నందు నిరసన తెలిపిన తరువాత దర్యాప్తు చేసి న్యాయం చేస్తామన్న హామీపై నిరసనను ముగించారు కానీ అమలు కాలేదు మహిళా రెజ్లర్లకు బహిరంగంగా తక్కువ చేసి వారి ఫిర్యాదులను రాజకీయం చేస్తున్నారని అన్నారు. అప్పటి క్రీడా మంత్రి మరియు డబ్ల్యూ.ఎఫ్.ఐ ద్వారా నియమించబడిన మరికొందరు కోచులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు ఇదంతా జరుగుతున్నప్పటికీ బీజేపీ ప్రభుత్వం ఎంపీ,మంత్రి బ్రిడ్జ్ భూషణ్, సందీప్ సింగ్ రెజ్లర్ల ను బెదిరించడం చేస్తున్నారని రెజ్లర్లకు తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని భయపడుతున్నారు తక్షణమే బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ ఎంపీ,మంత్రిని ప్రభుత్వ పదవుల నుండి సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని రాష్ట్ర మహిళా ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.సత్తిబాబు మాట్లాడుతూ ఈ దేశంలో బీజేపీ,ఆర్.ఎస్.ఎస్ ఉన్నంతకాలం మతోన్మాద దాడులు, భారత రాజ్యాంగ చట్టం ప్రకారం ఉన్నతమైన స్థాయిలో ఉన్నప్పటికీ మహిళల పైన క్రిస్టియన్,ముస్లింలు అణగారిన కుటుంబాల పైన నిరంతరం దాడులు జరుపుతూనే ఉన్నారు దేశ ప్రధాని నరేంద్ర మోడీకి భారత రాజ్యాంగం పట్ల గౌరవం, మహిళపై జాలీ దయ ఉంటే బిజెపి ఎంపీ,మంత్రిని తక్షణమే అరెస్ట్ చేయాలని సిపిఐ , సిపిఎం ప్రజా సంఘాలు డిమాండ్ ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం పార్టీ ప్రజా సంఘాల నాయకులు ఎల్ గౌరీ, కెవి సూర్యప్రభ, మాకిరెడ్డి రామునాయుడు, జి.గురు బాబు, కె.ప్రసన్న, కనకమహాలక్ష్మి, శివలంక కొండలరావు, ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

లబ్ధిదారులకు ఋణాలు మంజూరు చేయండి

బ్యాంక్ అధికారులతో జీవీఎంసీ కమీషనర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : టిడ్కో ఇండ్ల లబ్ధిదారులకు బ్యాంకు ఋణాలు త్వరతగతిన మంజూరు చేయాలని జివిఎంసి కమీషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ వివిధ బ్యాంకుల అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జివిఎంసి పరిధిలోని అన్ని బ్యాంకుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిచే దబ్బంద, సత్యనారాయణపురంల లోని టిడ్కో ఇండ్లు ప్రారంభించడం జరుగుతుందని, అందుకు లబ్ధిదారు లందరికీ బ్యాంకు ఋణాలు ఈ నెల ఆఖరి నాటికి పూర్తి చేయాలని బ్యాంక్ అధికారులకు తెలియజేశారు. లబ్ధిదారులందరూ పేదవారే కాబట్టి నిబంధనల పేరుతో బ్యాంకు ఋణాలు అలసత్వం ప్రదర్శించకుండ సక్రమంగా ఋణాలు మంజూరుకు సహకరించాలన్నారు. మిగిలిన ఫేస్-1లో నిర్మిస్తున్న టిడ్కో ఇండ్లకు జూన్ 15వ తేదీ లోపు ఋణాలు మంజూరు చేయాలని, ఫేస్-2లో నిర్మిస్తున్న ఇండ్లకు త్వరగా ఋణాలు మంజూరు చేయాలన్నారు. ఇవే కాకుండా జగనన్నతోడు, జగనన్న కాలనీలకు కూడా ఋణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులు వివరాల జాబితాలను జివిఎంసి అధికారులు బ్యాంకులకు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులందరు లబ్దిదారులకు ఋణాలు మంజూరుకు సహకరిస్తామని కమీషనర్ కు హామీ ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో జివిఎంసి ప్రాజెక్ట్ డైరెక్టర్ (యు.సి.డి.) పాపునాయుడు ఎపిడిలు, సిఒలు, టిడ్కో కార్యనిర్వాహక ఇంజనీరు, సెంట్రల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ తో పాటు ఇతర బ్యాంకుల లీడ్ మేనేజర్లు, రీజనల్ బ్యాంక్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన తాగునీటి పథకం

- మరమ్మత్తు చేసి పునరుద్ధరించడంలో అధికారుల నిర్లక్ష్యం

- తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు

విశాలాంధ్ర - అరకులోయ : మండలంలోని మారుమూల లోతేరు పంచాయితీ తోట వలస గ్రామంలో గిరిజనుల సౌకర్యార్థం నిర్మించిన సోలార్ తాగు నీటి పథకం గత నాలుగు నెలలుగా మరమ్మత్తు గురై మూలన చేరడంతో ఆ గ్రామంలో తీవ్రమైన మంచినీటి కొరత ఏర్పడింది. దీంతో ఆ గ్రామస్తులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవికాలం సమీపిస్తుండటంతో గ్రావిటీ మరవత్తుకు గురవడంతో వేసవిలో ఇంకా ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆ గ్రామంలో సుమారు 30 కుటుంబాలు ఉండగా ఒక తాగునీటి బోరు,సురక్షిత తాగునీటి సౌకర్యార్థం ప్రభుత్వం సోలార్ విద్యుత్ ద్వారా గ్రావిటీ పథకాన్ని నిర్మించారు. ప్రస్తుతం తాగునీటి బోరు పనిచేస్తుండగా గత నాలుగు నెలల నుంచి సోలార్ గ్రావిటీ మరమ్మతుకు గురైంది. దీంతో ఆ గ్రామంలో ఒక్క తాగునీటి బోరు మాత్రమే ఆధారంగా ఉండటంతో ఆ గ్రామస్తులంతా ఒకే బోర్డు నుంచి నీళ్లు తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ప్రస్తుతం పనిచేస్తున్న తాగునీటి నోరు కూడా వేసవిలో ఎండలకు తీవ్రతకు ఇంకిపోతుందని ఆ గ్రామస్తులు చేస్తున్నారు. గ్రావిటీ మరమ్మత్తు చేపట్టాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సోలార్ గ్రావిటీ పథకాన్ని మరమ్మత్తు చేపట్టి వేసవిలో తాగునీటి సమస్య తీవ్రం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు.

రొయ్యల చెరువులకు అనుమతులు లేవు : మత్స్యశాఖ ఏడీ ప్రసాద్

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని వెంకటనగరం గ్రామ సమీపంలో సాగు చేస్తున్న రొయ్యల చెరువులకు ఎటువంటి అనుమతులు లేవని మత్స్యశాఖ ఏడీ ప్రసాద్ తెలిపారు. అనుమతులు లేని రొయ్యల చెరువులు వల్ల వెంకటనగరం, రాజానగరం గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు, తాగునీరు కలుషితంపై సర్పంచ్ వంకా వెంకటరమణ పత్రికల దృష్టికి తీసుకొచ్చారు. రొయ్యల చెరువులపై కథనాలు వెలువడడంతో తహశీల్దార్ జైప్రకాష్ విచారణ నిర్వహించారు. గురువారం మత్స్య శాఖ ఏడీ ప్రసాద్ గ్రామంలో ఉన్న రొయ్యల చెరువులను పరిశీలించారు. రొయ్యల చెరువులకు ఎటువంటి అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా కూడా ఉన్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రొయ్యల చెరువులపై చర్యలు నిమిత్తం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఏడీ ప్రసాద్ తెలిపారు.

తెలుగుదేశంతోనే బీసీల అభివృద్ధి : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

విశాలాంధ్ర -పెందుర్తి : స్వర్గీయ ఎన్. టి.ఆర్. తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుండి తెలుగు రాష్ట్రాల్లోని వెనుకబడిన వర్గాలు అభివృద్ధి పదంలో సాగుతున్నాయని టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పెందుర్తి మండలం వేపగుంట సమీపంలోని మీనాక్షి కన్వెన్షన్ హాల్లో, బీసీలు, మత్స్యకారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఒకప్పుడు వెనుకబడిన వర్గాలను పట్టించుకోని పరిస్థితి ఉండేదని, కేవలం కుల వృత్తుల మీద జీవనోపాధి చేసేవారన్నారు. సముద్రంలోకి పోతే తిరిగి వస్తారో లేదో తెలియని పరిస్థితి మత్యకారులదని, అన్ని కులవృత్తులకంటే..ఎక్కువ రిస్క్ తో కూడుకున్న వృత్తి చేపలవేట అన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో వారి ప్రాణాలను కాపాడే టెక్నాలజీని తీసుకువచ్చామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ హయాంలో 9 రెసిడెన్సియల్ స్కూల్స్ మత్యకారులకు ఏర్పాటు చేసామని చెప్పారు. హుదుద్ తుఫాను వచ్చినప్పుడు మాములు వ్యక్తుల కంటే మత్యకారులకు ఎక్కువ బెనిఫిట్స్ కల్పించామన్నారు. పడవలు, బొట్లు డీజిల్ కి ఎక్కువ రాయితీ ఇచ్చింది తెలుగుదేశం పార్టీయేనని స్పష్టం చేసారు.బోట్లు ధ్వంసం అయితే 6 లక్షల పరిహారం ఇచ్చామని గుర్తు చేసారు. చేపలను పెంచుకునేవారికి ఆర్థికసాయం చేసి ఆదుకున్నామన్నారు. ఆనాడు ఒక మంచి ఉద్దేశ్యంతో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే, ఈనాడు అందులో పనిచేస్తున్న వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాక ముందు తలనిమిరాడు,ముద్దులు పెట్టాడు..ఇప్పుడు పిడిగుద్దులు గుద్దుతున్నాడని జగన్ ను ఉద్దేశించి చంద్రబాబు ఎద్దేవా చేసారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు గంటా శ్రీనివాసరావు బండారు సత్యనారాయణమూర్తి కొల్లు రవీంద్ర పార్టీ నాయకులు పల్లా శ్రీనివాసరావు భరత్ తదితరులు పాల్గొన్నారు చంద్రబాబుతో సెల్ఫీ తీసుకునేందుకు టిడిపి కార్యకర్తలు పోటీపడ్డారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర - చీడికాడ : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రంథాల యధికారిని యమ్ యస్ యల్ జోగేశ్వరి ఆధ్వర్యంలో సుమారు 30 మంది విద్యార్థులకు మూఢనమ్మకాలు వల్ల వచ్చే అనర్థాలను వివరించారు పాత్యాంశా కథల పుస్తకాలు చదివించారు జనరల్ నాలెడ్జ్ ను సంబంధించిన విషయాలును పిల్లలకు ఉపాధ్యాయులు యమ్ ప్రసాదరావు బోదించారు.

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - చోడవరం : మహిళా రెజ్లర్ల మీద లైంగిక వేదింపులు ఆపాలని, వేధింపులకు పాల్పడ్డ వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ చోడవరం కోటవీధిలో పట్టణ మహిళా సంఘాలు గురువారం భారీ ఆందోళనకు దిగారు. మహిళా సంఘం అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ క్రీడల్లో పతకాలను సాధించి, దేశ ప్రతిష్టను కాపాడే వారి పై దాడులకు పాల్పడటం సిగ్గు చేటన్నారు. రెజ్లర్ల పై లైంగిక దాడులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్, హర్యానా మంత్రి సందీప్ సింగ్ ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు. అరెస్ట్ చేసి ప్రభుత్వ పదవుల నుండి తొలగించాలని, మహిళా మల్ల యోధులకు భద్రత కల్పించాలని సీఐటీయూ, ఐద్వా మహిళా సంఘాలు ఆధ్వర్యాన డిమాండ్ చేస్తూ మహిళలు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో జె. వెంకటలక్ష్మీ, సత్యవతి, ఆర్. లక్ష్మి, దేముడమ్మ, రమణమ్మ, మంగమ్మ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి నోవెటాల్‌లో సూత్ర ఎగ్జిబిషన్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ప్రముఖ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సంస్థ సూత్రా నోవాటెల్ హొటెల్ నందు మే నెల 20, 21 తేదీలలో రెండు రోజులు పాటు ఎగ్జిబిషన్ నిర్వ హిస్తున్నట్లు సూత్ర నిర్వాహకులు చెప్పారు. డ్రెస్సుల నుంచి గౌనులు వరకు, చీరల, పాదరక్షలు, ఉపకరణాలు మరెన్నెన్నో విభిన్న డిజైనర్స్ ఉత్పత్తులను సూత్రా ఈ ఎగ్జిబిషన్ నందు ప్రదర్శిస్తున్నాది. ప్రదర్శన అమ్మకాలు జరపనున్నట్లు చెప్పారు. దేశం లోని వేర్వేరు. ప్రదేశాల నుంచి ఈ ప్రదర్శనలో 40 పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటారన్నారు. దేశం వ్యాప్తంగా విభిన్న తరహా డిజైనర్స్ కలెక్షన్స్ తో మేము ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్న మన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూత్రా నిర్వాహకులు కోరారు.

డిక్షనరీ వినియోగంపై అవగాహన

విశాలాంధ్ర - నర్సీపట్నం : శాఖా గ్రంథాలయం, నర్సీపట్నం నందు సిహెచ్ భవాని) స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ చెప్పారు. డిక్షనరీ ఎలా ఉపయోగించాలో వివరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.ప్రభాకర రావు దేశభక్తి గీతాలు పాడించారు. కథలను చెప్పి నిత్య జీవితంలో ఎలా మెలగాలి అని వివరించారు. కె.లక్ష్మి రాజేశ్వరి, బలిగట్టం, క్రాఫ్ట్ టీచర్ గారు పేపర్ కటింగ్ తొ పువ్వులు ఎలా చేయాలో చూపించారు. పిల్లలందరి చేత చేయించారు. పిల్లలందరూ చాలా ఉత్సాహంగ పాల్గొన్నారు. గ్రంధాలయధికారిణి పి.దమయంతి పిల్లలందరు సభ్యులుగా చేరాలని కోరారు ఈ కార్యక్రమంలో 52 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

విశాలాంధ్ర- కోటవురట్ల : మండలంలో సుంకపూరు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఏపీవో గంగు నాయుడు ఏఎన్ఎం లు గురువారం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏపీవో పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని జరిగే ప్రాంతంలో మంచి నీరు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన కూలీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఊరటనిచ్చిన అకాల వర్షం.. సేదతీరిన మన్యప్రాంత ప్రజానీకం

విశాలాంధ్ర - చింతపల్లి : వేసవి తాపం ఉక్క పోతలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న మన్య ప్రాంత ప్రజానీకానికి గురు వారం కురిసిన అకాల వర్షం ఊరటనిచ్చింది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మన్య ప్రాంతంలోనూ తీవ్రంగా కాస్తున్న ఎండ వేడిమికి ఇబ్బంది పడుతున్న మన్య ప్రాంతవాసులకు గురువారం కురిసిన అకాల వర్షం ఊరటనిచ్చి సేద తీర్చింది. బుధవారం రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉక్క పోత తో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజానీకం నిద్రలేమితో సతమతం అయ్యారు. ఉదయం నుంచి భీకరంగా భానుడు ప్రతాపం చూపినప్పటికీ మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షం తో మన్య ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

సామాజిక సేవ ద్వారా వ్యక్తులకు గుర్తింపు

విశాలాంధ్ర- పెదగంట్యాడ : సామాజిక సేవతోనే వ్యక్తులకు గుర్తింపు ఉంటుంది అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు.గాజువాక 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు జన్మదినం సందర్భంగా బీసీ రోడ్డు, దయాల్ నగర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయాల్లో ఉంటూనే స్వచ్ఛంద సేవ చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. సామాన్య కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించి కార్పొరేటర్‌గా నేడు ప్రజలకు సేవ చేయడమే కాకుండా, వార్డుని ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. వైసీపీలో ఉండే ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చినతల్లి, వార్డు వైసీపీ కమిటీ, మూర్తి యువజన, ఆర్పీలు, సచివాలయాల సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - దేవరాపల్లి : దేవరాపల్లి మండలోనీ అన్ని గ్రామాల్లో మహాత్మా గాంధీ ఉపాధి హామీ పనులు చేస్తున్న అన్ని చోట్లను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న గురువారం పర్యటించి అక్కడ పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని సమయంలో రైతు కూలీలకు ఉపాధి హామీ పథకం తోడుగా ఉంటుందన్నారు. ఎండా కాలంలో ఏ పనీ లేకపోవడంతో వ్యవసాయ కూలీలే కాక డిగ్రీ చదువుతున్న యువతి యువకులు సైతం ఉపాధి పనులకు వెళ్తున్నారన్నారు. ఉపాధీ హామీ పథకం పేదలకు వరం లాంటిదని, దీని కేంద్ర ప్రభుత్వం మరింత ఎక్కువ నిధులు కేటాయించాలని, సమ్మర్ అలవెన్సులు 40 శాతం ఇవ్వాలని, వీటి తో పాటు 100 రోజులు పూర్తి చేసిన కుటుంబానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం పని చూపాలన్నారు. పని చేసే చోట కనీస సౌకర్యాలైన టెంట్, నీళ్ళు, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని, ఆన్లైన్ మిస్టర్ రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని, క్షేత్రస్థాయిలో మెట్లకు స్మార్ట్ ఫోన్లు పారితోషికం ఇవ్వాలన్నారు.

గోవులకు శాపంగా లంపిస్కిన్ వ్యాధి

విశాలాంధ్ర - చింతపల్లి : లంపిస్కిన్ వ్యాధి గోవులకు శాపంగా తయారైంది. చర్మంపై చిన్న చిన్న పొక్కులతో పుండ్లు ఏర్పడి గోవులను క్షీణింప జేసి ప్రాణాలు హరించే ఈ వ్యాధి గోవులకు మాత్రమే సోకుతుంది. ఇప్పటికే ఈ వ్యాధి బారిన పడి మన్యంలో చాలావరకు గో సంతతి హరించుకుపోయింది. మండల కేంద్రంలోనూ బజార్లో తిరిగే గోవులు ఈ వ్యాధి సోకి ఆలనా పాలనా లేక చాలావరకు మృత్యువాత పడ్డాయి. వ్యాధి సోకిన తరువాత గోవులు కనీసం తిండి తినే శక్తి కూడా లేక వాటి యజమానులు పట్టించుకోక పోవడం వలన ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ కడుపు కాలి ఏది పడితే అవి తిని మృత్యుఒడికి చేరుతున్నాయి. సాధు జంతువులైన గోవుల ఆలనా పాలనా చూస్తూ దైవంగా పూజించుకునే తెలుగు రాష్ట్రాలలోనే వీటిని పోషించలేని యజమానులు వాటిని ఇళ్ల వద్ద కట్టి సంరక్షించకుండా వదిలివేయడంతో మన్యం రహదారులలో ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా సంచరిస్తూ దొరికిన కాడికి తింటూ గడుపుతున్న గో సంతతి పచ్చిక దొరకక, కూరగాయలు, గోడ పత్రికలు, ప్లాస్టిక్ వ్యర్థాలను సైతం తింటూ అవి అరగక మూగ రోదనతో మృతి చెందుతున్నాయి. పశు సంతతిని రక్షించవలసిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో మన్యంలో గోవుల సంతతి క్రమేపీ కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

స్టీల్ ప్లాంట్ నూతన డైరెక్టర్‌ని కలిసిన ఓబీసీ కమిటీ

విశాలాంధ్ర - కూర్మన్న పాలెం : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో నూతన డైరెక్టర్ పర్సనల్ బాధ్యతలు చేపట్టిన సురేష్ కుమార్ పాండేని ఓబీసీ కమిటీ మర్యాదపూర్వకంగా గురువారం కలవడం జరిగింది ఈ సందర్భంగా శ్రీ పాండే మాట్లాడుతూ ప్లాంట్ ఇప్పుడున్న పరిస్థితుల్లో మనమందరం కలిసి పనిచేసే ప్లాంట్ ను ముందుకు తీసుకెళ్లడంలో మనందరం కూడా కృషి చేయాలని ఆయన తెలియజేశారు ప్లాంట్ లో ఉన్నటువంటి పర్మనెంట్ కార్మికులు అధికారులు కాంట్రాక్ట్ కార్మికులు యాజమాన్యం అసోసియేషన్లు అందరూ కలిసి సమన్వయంతో పనిచేసి ఈ ప్లాంట్ ని రక్షించుకోవాలని ఆయన తెలియజేశారు అదే సందర్భంగా ప్లాంట్లో బలమైన ఓబిసి అసోసియేషన్ తమ వంతు కృషి చేస్తుందని ఓబీసీలకు రావాల్సిన రాయితీలు సహాయక కార్యక్రమాలు కు యాజమాన్యం ఓబిసి అసోసియేషన్ కి ఎల్లప్పుడూ సహాయకారిగా ఉండాలని ఓబీసీ అధ్యక్షులు బి అప్పారావు గారు కార్యదర్శి శ్రీనివాసరావు లై జన్ ఆఫీసర్ గంట అప్పారావు, మరియు హాజరైన ఓబీసీ నాయకులు కోరడం జరిగింది మరియు ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రా జ క్ట్స్ మరియు ఇన్చార్జ్ డైరెక్టర్ ఆపరేషన్ ని కలిసి ప్లాంట్ ను పూర్తిస్థాయిలో పని చేయించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో ఓబీసీ నాయకులు ఆర్ వి నారాయణ, యు శ్రీనివాస్ ఎంఎస్ ప్రసాద్ శశిభూషణ్ రావు వి సింహాచలం మోహిద్దున్, శేషగిరి కొణతాల రామకృష్ణ చిన్ననాయుడు డి అప్పలనాయుడు పల్లాపెంటరావు ఈశ్వర్ రావు నర్సింగ్ రావు సన్న బాబు ఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

'బాడీకేర్ కిడ్స్' బ్రాండ్ అంబాసిడర్‌గా కాజల్

విశాలాంధ్ర - విశాఖపట్నం : 'బాడీకేర్ కిడ్స్' బ్రాండ్ అంబాసిడర్‌గా నటి కాజల్ అగర్వాల్ సంతకం చేశారు. ఇది చిన్నారుల బట్టలు, ఇన్నర్‌వేర్‌లు అందించే అతిపెద్ద సంస్థ. ఈ సందర్భంగా బాడీకేర్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డైరెక్టర్ మిథున్ గుప్తా మాట్లాడుతూ భారతదేశంలో కిడ్స్‌వేర్ తయారీదారులలో బాడీకేర్ ఇంటర్నేషనల్ ఒకటన్నారు. ముప్పై ఏళ్లుగా దేశంలోని మిలియన్ మంది తల్లులు మా బ్రాండ్ను విశ్వసించారన్నారు. కాజల్ అగర్వాల్‌తో ఈ భాగస్వామ్యం మార్కెట్లో బలమైన బ్రాండ్ పొజిషనింగ్‌ను ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఇది బ్రాండ్ ఇమేజ్‌ను సరికొత్త హైట్స్కు తీసుకు వెళుతుందన్నారు. బాడీకేర్ కిడ్స్ స్టైలిష్, వైబ్రెంట్ శ్రేణి పిల్లల దుస్తులు, ఇన్నర్‌వేర్‌లను అందిస్తుందన్నారు. పిల్లల డిమాండ్‌లను తీర్చడానికి సరైన ఫిట్ ఆకర్షణీయమైన ప్రింట్‌లను నిర్ధారిస్తూ.. సౌకర్యం, దద్దుర్లు లేని దుస్తులను అందించడంపై దృష్టి పెడుతుందని తెలిపారు. కాజల్ అగర్వాల్‌ని బాడీకేర్ కుటుంబానికి స్వాగతించడం ఆనందంగా ఉందన్నారు. సంవత్సరాలుగా బాడీకేర్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ దాని అన్ని ఉత్పత్తులలో సంపూర్ణ ఫిట్‌ను అందిస్తుందన్నారు. తన మనోహరమైన వ్యక్తిత్వం ఆకట్టుకునే అభిమానుల ఫాలోయింగ్‌తో కాజల్ మా కస్టమర్‌లతో బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకోవడంలో బ్రాండ్ అవగాహనను సమర్థవంతంగా పెంచడంలో మాకు సహాయం చేస్తుందన్నారు. 2030 నాటికి ఐదు వేల కోట్ల వ్యాపార లక్ష్యాన్ని పెట్టుకున్నామన్నారు. ఈ దార్శనికతను సాకారం చేసుకోవడానికి, మౌలిక సదుపాయాలను విస్తరించడంలో ఇప్పటికే ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో దూకుడుగా పెట్టుబడి పెట్టడం ద్వారా మేము వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. 450పైగా పంపిణీదారులు, 18 వేలకు పైగా రిటైలర్లు, అన్ని ప్రధాన ఆన్‌లైన్ పోర్టల్‌లలో విస్తృతమైన ఉనికిని కలిగి ఉన్న నెట్‌వర్క్‌తో బాడీకేర్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ తన ఉత్పత్తుల శ్రేణిని దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు చేరుతుందని పేర్కొన్నారు.

ఖండివరంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - చీడికాడ : మండలంలో ఖండివరం గ్రామంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మూడవ రోజు గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండు టెండను సహితం లెక్కచేయకుండా గ్రామంలో 1090 నివాసాలను దర్శించి ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను వారికి అందజేసి ప్రజల యొక్క సమస్యలను ప్రభుత్వ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు జగనన్న కోలనిలో భాగంగా 144 మంది లబ్ధిదారులకు 109 మందికి జగనన్నలేఔట్ లు35మందికి సాధారణ గృహాలు నిర్మించడం జరుగుతుందన్నారు అవ్వాతాతలతో కలిసి కాసెపువాళ్లతో ముచ్చటించారు తనకు కేటాయించిన 50 ఇళ్లలో ప్రజలకు అందించినవలసిన సేవలు అందించని వాలంటీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని యంపిడిఓ జయప్రకాశరావును ఆదేశించారు అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో ముచ్చటించి వారికి తినుబండారాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూరచా జయమ్మ నారాయణమూర్తి వైసిపి మండల కన్వీనర్ గొల్లవిల్లి రాజబాబు ఎంపీటీసీలు షేక్ సూర్యనారాయణ గెంజి స్వాతి విశాఖడైరీ డైరెక్టర్ శిరంరెడ్డి సూర్యనారాయణ సుంకర శ్రీనివాసరావు మోసురి సన్నిబాబు పంచాయతీ కార్యదర్శి వీర్రాజు విఆర్ఓ అప్పారావు తదితరులు పాల్గొన్నారు

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

విశాలాంధ్ర - కే కోటపాడు : జిల్లా కలెక్టర్ రవి ఆదేశాల మేరకు ఉపాధి కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అలాగే పని ప్రదేశంలో తాగునీరు టెంట్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో శచిదేవి సిబ్బందిని ఆదేశించారు. మండలం లోని కె కోటపాడు, కింతాడ, చౌడువాడ, గొందు పాలెం రొంగలు నాయుడుపాలెం , ఏ.కోడూరు, వారాడ తదితర గ్రామాలలో ఉపాధి పనులను ఏపీవో వసంత కుమార్ పరిశీలించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో కూలీలకు బిందెలతో త్రాగునీరు అందుబాటులో ఉంచారు. వడదెబ్బ బారిన పడకుండా కూలీలందరికి ఆయా గ్రామాల ఏఎన్ఎంలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కింతాడలో ఏఎన్ఎం నాగమణి , వీఆర్పి బందారు గంగు నాయుడు , ఆశా కార్యకర్త రామలక్ష్ములు పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని ప్లాస్టిక్ బాటిల్లతో అందజేశారు.

ఫారెస్టు బిల్లు జాతి ప్రయోజనాలకు విఘాతం

బిల్లు ప్రతులు చించి నిరసన తెలిపిన ఎపి విదసం ఐక్యవేదిక

విశాలాంధ్ర - విశాఖ : గిరిజనుల సహజ ఆవాసాలైన అటవీ ప్రాంతం నుండి అడవి బిడ్డలను బయటకు తరిమేసి, అటవీ సంపదను కార్పొరేట్ లకు కట్టబెట్టే కుట్రతో తెచ్చిన ఫారెస్ట్ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని వి ద సం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేశారు. 105వ రాజ్యాంగ సవరణ కోసం పార్లమెంటులో ప్రవేశపెట్టిన అటవీ సంరక్షణ బిల్లుకు వ్యతిరేకంగా గురువారం ఆంధ్రప్రదేశ్ వి ద సం ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1996 పీసా చట్టం ప్రకారం పంచాయతీ తీర్మాన%శీ% లేనిదే ఏ ప్రాజెక్టు ను చేపట్టరాదన్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే 2006 అటవీ హక్కుల చట్ట%శీ%, పీసా చట్టం, 1/70 చట్టం అస్తిత్వం కోల్పోయి అడవిని ప్రైవేటు వ్యాపార కేంద్రం గా మార్చి జాతి సంపదను అదానీ, అంబానీలకు దోచి పెట్టేందుకు మోడీ ఎత్తుగడ వేసారని దుయ్యబట్టారు. ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమన్నారు. 2023 ఫారెస్ట్ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ని డిమాండ్ చేశారు. ఎస్ ఆర్ వేమన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, వర్లమూరి ఫ్రాన్సిస్, కోలహరి బాబు, నిర్మల, ఎస్ రాజేంద్ర ప్రసాద్, డి అప్పారావు, ఎస్ నూక రాజు, రామ్ ప్రభు, కే ప్రసాదరావు, వై బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - పరవాడ : క్రీడాకారులపై వేదింపులకు పాల్పడిన రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ ని తక్షణమే అరెస్ట్ చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. పరవాడ మండల పరిషత్ కూడలిలో గురువారం ఆయా సంఘాల నేతలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు, ఆర్.శంకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం. రమణ మాట్లాడారు. తమపై లైంగిక వేధింపులను నిరసిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద గత 25 రోజులుగా మహిళా రెజ్లర్లు ఆందోళన నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. దేశ ప్రతిష్టని పెంచే క్రీడాకారులు తమకు అన్యాయం జరిగిందని ఇన్ని రోజులుగా పోరాడుతుంటే వాళ్ళకి న్యాయం చేయాల్సింది పోయి ప్రభుత్వమే తిరిగి క్రీడాకారులపై దాడులు చేయడం హేయమైన చర్యని విమర్శించారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో సామాన్య మహిళలకే కాదు మహిళా క్రీడాకారులకు కూడా రక్షణ లేకపోవడం సిగ్గు చేటు అని మండి పడ్డారు. ఫోక్సో, నిర్భయ చట్టాలను అమలు చేసి బ్రిజ్ భూషణ్ ని అరెస్ట్ చేసి మహిళా రెస్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ ఆందోళనకు ప్రపంచం వ్యాప్తంగా మద్దతు లభిస్తుందని, దేశంలో ఉన్న ప్రజలందరిని ఏకం చేసి ఆందోళనను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు అంతా ,క్రీడాకారుల పక్షాన రోడ్డు ఎక్కి ఆందోళనలో పాల్గొంటున్నారని, మహిళా రెస్లర్లకు న్యాయం జరగని యెడల త్వరలో జరగబోయే ఉదృత ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం మెడలు వంచక తప్పదని హెచ్చరించారు. భవిష్యత్తులో క్రీడాకారులకు అండగా జరిగే ఆందోళనలకు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.మోహన్ మనోజ్ కుమార్, కేశవ, తను, మూర్తి, అభి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

పలు గ్రామాల్లో జనసేన నాయకుల పర్యటన

విశాలాంధ్ర - జి.మాడుగుల : అల్లూరిసీతారామరాజు జిల్లా. గురువారం నాడు పెద్దబయలు జిమాడుగుల మండలాల సరిహద్దులో గల వేలంగరువు చాప గడ్డ ,చదురుమామిడి గ్రామలను పర్యటించి ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడం జరిగింది ప్రజలతో కలిసి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని వివరించడం జరిగింది రాష్ట్రంలోని ప్రజలందరూ కొత్త ప్రభుత్వ పాలన కోసం ఎదురు చూస్తున్నారు. రానున్న ఎన్నికలలో తప్పకుండా జనసేన పార్టీకి ఓటు వేసి పవన్ కళ్యాణ్ గారికి సీఎంగా గెలిపించుకుందామని ఆయనకు మద్దతుగా నిలబడదామని చెప్పారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇల్లు గాని సిసి రోడ్లు గాని మంచినీటి సౌకర్యం గాని లేదని చెప్పారు, నమ్మి ఓటు వేసిన నాయకులు ఇప్పటిదాకా మా గ్రామాన్ని సందర్శించలేదని ఎమ్మెల్యే ఎవరో ఎంపీ ఎవరో మాకు తెలియలేదని పేర్లు తప్ప ముఖాలు మాకు తెలియవని ఎటువంటి ఆదాయ వనరులు లేని కారణంగా సొంత ఇల్లు కట్టుకోలేకపోతున్నామని వాపోయారు ఒకే ఇల్లు రెండు మూడు కుటుంబాలు కలిసి జీవిస్తున్నామన్నారు పండించిన పసుపుకి గిట్టుబాటు ధర లేకపోవడం వలన పిల్లలకు ఫీజులు కట్టి పైచదువులు కూడా చదివించుకోలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. మీలాంటి నాయకులు మాకు అవసరం లేదని గ్రామస్తులు ఈ సందర్భంగా తెలియ జేసారు ఈ సందర్భంగా రాజన్ మాట్లాడుతూ మీకు జనసేన పార్టీ తరఫున మేము అండగా ఉంటామని మీకు జరుగుతున్న అన్యాయం పట్ల ప్రభుత్వానికి నిలదీస్తామని చెప్పారు, రేపు మన పార్టీ అధికారం రాబోతుందని మీ పక్షాన మేమున్నాము మేము నిలబడతాం మాతోపాటు మీరు మద్దతుగా ఉండాలని భరోసానివ్వడం గిరిజనజాతి యువకుడిగా మా బాధ్యతని ప్రతి గ్రామ గ్రామానికి జనసేన పార్టీని ప్రజలు ఆదుకుంటున్నారు ఆహ్వానిస్తున్నారు, కొత్త పాలనను అవినీతి రహిత పాలనను నీతివంతమైన పాలనను చూడాలని ప్రజల ఆకాంక్షిస్తున్నారని మాకు ప్రజలు భారీ ఆహ్వానాలకు కారణం ప్రభుత్వం చేస్తున్న మోసాలు,దగాలే కారణమని ఈ సందర్భంగా తెలియజేశారు.

పోలవరం పునరావాసంపై సీపీఎం మహా పాదయాత్ర

విశాలాంధ్ర - చింతూరు : విలీన మండలాల పర్యటనలో భాగంగా గురువారం సిపిఎం పార్టీ బృందం చింతూరు లో విలేకరుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత బాధితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందే వరకు దశల వారి పోరాటాలను చేపడుతామన్నారు. దీనిలో భాగంగా జూన్ 20 నుండి మహా పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ముంపు ప్రాంతాల్లో గత సంవత్సరం వరదలు సంభవించి నష్టపోయిన నిర్వాసిత ప్రాంతాల్లో ప్రభుత్వం వరద సహాయక కార్యక్రమాలు నిర్వహిం చడంలో విఫలమైందన్నారు. జూన్ 15 వరకు ముందుగానే వరద సహాయక చర్యలు చేపట్టాలన్నారు.గత సంవత్సరం జగన్ ప్రభుత్వం ముంపు బాధితులకు పరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. జూన్ మొదటి వారం నుండి గ్రామసభలు నిర్వహిస్తామని జూన్ 20 నుండి పాదయాత్ర చేపడతామన్నారు. ప్రజా సమస్యలు పై ప్రధానంగా పాదయాత్ర కొనసాగు తుందన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేస్తామన్నారు. మోడీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని దానికి జగన్ ప్రభుత్వం కూడా వంత పాడుతుందని విమర్శించారు. పెండింగ్ లో ఉన్న తునికాకు బోనస్సు ఆదివాసీలకు తక్షణమే చెల్లించాలని. పోడు భూములకు పట్టాలు అందించాలని. ఉపాధి కూలీలకు పూటకు 350 రూపాయలు చెల్లించాలని. ఉపాధి పని ప్రదేశంలో అన్ని రకాల సదుపాయాలు మజ్జిగ వంటివి ఏర్పాటు చేయాలని. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూన్ 15 నాటికి పూర్తిస్థాయిలో పోలవరం పరిహారం అందజే యాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వి. వెంకటేశ్వర్లు. జిల్లా కార్య దర్శి బప్పెన కిరణ్. కార్యదర్శివర్గ సభ్యులు లోత రామారావు, కుంజా సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, మేకల నాగేశ్వరరావు, పల్లపు వెంకట్ సీసం సురేష్, ఐవి, పాయం సీతారామయ్య పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - పరవాడ : పరవాడ మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి.హేమసుందరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు తదితర ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు. అలాగే మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని కోరారు.

మారుమూల గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : గతంలో మారుమూల గ్రామాల్లో ప్రజల రవాణా సౌకర్యార్థంగా తిప్పిన ఆర్టీసీ బస్సులను మళ్లీ ఆయా గ్రామంలో పునరుద్ధరించాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జి దయానిధి డిమాండ్ చేశారు.మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాప్ వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలను మారుమూల గ్రామంలో సుమారు 20 ఆర్టిసి బస్సులను గతంలో ప్రభుత్వం నడిపేదన్నారు.అయితే ప్రస్తుతం బస్సులు నడపక పోవడంతో మారుమూలు ప్రాంత గిరిజనుల రవాణా సౌకర్యానికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి బస్సులను పునరుద్ధరించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పి చిన్నస్వామి,జె వెంకట్ బాబు, వి నరసయ్య జి.రఘు పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.89 కోట్లు

విశాలాంధ్ర - గోపాలపట్నం : ఉత్తరాంధ్ర ఆరాధ దైవం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామివారి హుండి ఆదాయం 29 రోజు లకు గాను రూ.1,89,90,670/- లు. భక్తులు స్వామి వారికి ముడుపులు, మొక్కుబడులు గా హుండిలో బంగారం 0.124.600 మిల్లి గ్రాములు, వెండి 14 కేజీల 565 గ్రాములు , యుఎస్ ఏ 11 డాలర్లు, బ్యాంక్ అఫ్ ఒమన్ 4 రియల్స్, ఖతర్ 14 రియల్, సింగపూర్ 12 డాలర్లు సమర్పించినట్లు కార్యనిర్వాహణాధికారి(ఇంచార్జ్) వి.త్రినాధరావు తెలిపారు. హుండి లెక్కింపులో దేవస్థానం సిబ్బంది తోపాటు శ్రీహరి, శ్రీవారి సేవా సంస్థలు పాల్గొన్నాయని కార్యనిర్వాహణాధికారి తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - కొయ్యూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని రాజేంద్రపాలెం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని గడపగడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పరిధి 242 గడపలను సందర్శించిన ఎమ్మెల్యే ప్రజలు తెలిపిన సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సంక్షేమ పథకాల ద్వారా ఎవరెవరికి ఎంత లబ్ధి చేకూరిందో ఎమ్మెల్యే తెలియజేశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే అటువంటివారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతుందని హామీ ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అవినీతిరహిత సుపరిపాలనను అందజేస్తూ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి వైసిపికి పట్టం కట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమేష్ పార్టీ మండల అధ్య క్షుడు బాబులు వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మునిలినాయుడు రాజేంద్రపాలెం చీడిపాలెం మూలపేట సర్పంచ్ లు సింహాచలం సోమన్నదొర కృష్ణ ఎంపీటీసీ మల్లేశ్వరి తహసిల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో మేరీ రోజ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అచ్యుత్ తదితర పలువురు పాల్గొన్నారు.

మాత శిశువు మరణాల అరికట్టేందుకు కృషి

విశాలాంధ్ర - హుకుంపేట : గ్రామాల్లో మాత శిశువు మరణాల అరికట్టిందుకు దృష్టి పెడుతున్నట్లు ఐసిడిఎస్ పీడీ సూర్యలక్ష్మి అన్నారు.మండల కేంద్రంలో స్థానికి ఐసిడిఎస్ కార్యాలయంలో శిశుమ రాణాలు, హరి కట్టిందుకు,నాటు వైద్య గురువులతో అమెరికాన్ ఇండియన్ ఫౌండేసన్, ఐసిడిఎస్ శాఖ వారు సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నాటు వైద్యం, మూఢనమ్మకాల ద్వారా పసర మందు పెట్టడం వలన మత, శిశువులు అధికంగా మరణిస్తున్నా రని అన్నారు. వీటికి నాటు వైద్యం గురువులు దూరంగా ఉండాలని తెలిపారు. మండలంలో ఎక్కడైనా చిన్నారులకు నాటు వైద్యం, వసురు మందులు పెట్టడం ద్వారా మృత్యు వత పడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని నాటువైద్యులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ రాజలక్ష్మి, ఐసిడిఎస్ సీడీపీఓ బాలచంద్రమని దేవి, ఐసిడిఎస్ సిబ్బంది మాన్సీ, ప్రోగ్రాం సిబ్బంది సురేష్, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానం అవకాశం కల్పిస్తే ప్రజలకు సేవ చేస్తా
జనసేన నాయకులు పెద్దాడ వెంకట రమణ

విశాలాంధ్ర - పాయకరావుపేట : అధిష్టానం అవకాశం కల్పిస్తే పాయకరావుపేట నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని జనసేన నాయకులు పెద్దాడ వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆలోచనలు, ఆశయాలకు నచ్చి జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు. డబ్బు ప్రభావం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయాలన్న పవన్‌కళ్యాణ్ ఆలోచన తనకు ఎంతో నచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్, టిడిపి పార్టీల్లో పని చేసి పాయకరావుపేట నియోజవకర్గ ప్రజలకు ఎన్నో రకాలుగా సేవ చేసినట్లు తెలిపారు. ఎంతో మంది దళిత యువకులకు కార్పోరేషన్ రుణాలు మంజూరు చేయించినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ కీలక రాజకీయ పాత్ర పోషిస్తుందని తెలిపారు. పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పాయకరావుపేట నియోజకవర్గంలో పర్యటి స్తున్నట్లు పెద్దాడ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అలమండల ప్రసాద్, గుమ్ముడి గోపి, అనపర్తి బాబ్జి, కృష్ణ, పెద్దాడ వాసు, జామ్ ప్రభాకర్, పెద్దాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - పాయకరావుపేట : ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ 5వ సెమిష్టర్ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు శ్రీప్రకాష్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీర్రాజు తెలిపారు. ఇందులో ఎంపీసీఎస్ గ్రూపులో మాకినీడి నందిని 10/10 గ్రేడు సాధించినట్లు తెలిపారు. అలాగే ఎంసీసీఎస్‌లో కె.రేణుక 9.6, ఎంఈసీఎస్‌లో కె.శిరీష 9.53, బయోటెక్‌లో టి.సౌజన్య 9.5, ఎంపీసీలో కె.రేష్మ 9.5, సీబిజడ్‌లో బి.శ్రీఉష 9.2, బి.కామ్‌లో పివి సాయి వాణి 9 గ్రేడు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేతలు సీహెచ్‌వికె నరసింహారావు, సీహెచ్ విజయ్‌ప్రకాష్ తదితరులు అభినందించారు.

చంద్రబాబు నాయుడు రోడ్ షో,
బహిరంగ సభ విజయవంతం చేయండి : బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : నేడు పట్టణంలో జరిగే చంద్రబాబు నాయుడు రోడ్ షో, బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు పిలుపునిచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు అనకాపల్లి పట్టణంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు విచ్చేయుచున్న సందర్భంగా అనకాపల్లి ప్రజానీకం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అనుబంధ సంస్థలు తెలుగు మహిళా తెలుగు రైతు తెలుగు యువత తెలుగు నాడు కార్మిక విభాగం తెలుగునాటి విద్యార్థి విభాగం బీసీ ఎస్సీ ఎస్టీ విభాగాలు బాలకృష్ణ , ఎన్టీఆర్ ఫ్యాన్స్ బాలకృష్ణ అభిమానులు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంల నుండి పాల్గొని రోడ్ షోను సభను విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 5:30 గంటలకు అనకాపల్లి పట్టణంలో సుంకర మెట్టు జంక్షన్ కి చేరుకుంటారని అక్కడనుండి రోడ్ షో ప్రారంభమవుతుందని మెయిన్ రోడ్ జంక్షన్ రింగ్ రోడ్ జంక్షన్ వన్ వై ట్రాఫిక్ జంక్షన్ చేపల బజారు జంక్షన్ చిన నాలుగు రోడ్ల జంక్షన్ శ్రీ కన్యకా పరమేశ్వరి జంక్షన్ వీధి వేల్పుల వీధి జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం నెహ్రూ చౌక్ జంక్షన్ కు చేరుకుంటారు. తదనంతరం 6.45 నిమిషాలకు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామని నాగ జగదీష్ తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షులు డాక్టర్ కేకేవిఏ నారాయణరావు ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ ఉపాధ్యక్షులు కుప్పిలి జగన్ బోడి వెంకటరావు పార్లమెంట్ కార్యదర్శి మల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పదంగా యువకుడు మృతి

విశాలాంధ్ర - ఆనందపురం : అనంద పురం మండలంలోని కోలవాని పాలెం గ్రామా నికి చెందిన గంట్రెడ్డి దారయ్య (26) ఈనెల 13 నుండి కనిపించడం లేదని అతను సోదరుడు గౌరీస్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు దారయ్య పెందుర్తి, గొల్లపల్లి గ్రామంలో జెసిబి డ్రైవర్ గా సుమారు నాలుగు సంవత్సరాలు నుంచి పని చేయుచున్నాడు. ప్రతిరోజు ఉదయం 7:30 గంటలకి డ్యూటీ కి హాజరై తిరిగి సాయంత్రం 6:30 గంటలకి ఇంటికి వస్తుంటాడు అదే మాదిరిగా ఈనెల తేద 13 న ఉదయం 7:30 గంటలకు డ్యూటీ కి వెళ్లి సాయంత్రం 6:30 గంటలకు డ్యూటీ నుంచి బయలుదేరి ఇంటికి వచ్చినట్లు తెలిసింది కాని ఇంటికి చేరలేదు. ఇలా ఉండగా గురువారం జీఎస్ అగ్రహారం గోరింటా గండం దిబ్బ దగ్గర మోటర్ బైక్ పక్కన యువకుడు మృతి చెంది ఉన్న విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దారయ్య మృతి చెంది సుమారు నాలుగు రోజులు ఉంటుందని బైక్ పక్కన పురుగుల మందు బాటిల్ వాటర్ బాటిల్ ఉన్నాయని తెలిపారు. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ఎవరైనా చంపేసి ఇక్కడ తీసుకొచ్చి వదేసినట్టు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు కు తండ్రి దేవుడు తల్లి మహాలక్ష్మి అన్నయ్య గౌరీష్, అక్క ప్రత్యూష ఉన్నారు. అక్కకి పెళ్లయిన గౌరీషికి మృతుడు ధారయ్య కి వివాహం కాలేదు ధారయ్య గ్రామంలో చాలా చలాకీగా ఉండేవాడని ఎవరితోనూ విరుద్ధం ఉండేది కాదని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈనెల 13న డ్యూటీకి వెళ్లి తిరిగి రాని మనిషి 18వ తేదీన జియస్ అగ్రహారం గోరింట గండం దిబ్బ దగ్గర మృతి చెంది ఉండడం నాలుగు రోజులైనా ఎవరైనా చూసి ఉంటారని ఇది కచ్చితంగా బయట చంపేసి తీసుకొచ్చి ఇక్కడ పడవేశారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి సిఐ రామచంద్రరావు ఆధ్వర్యం అనే కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డెట్ ఫండ్‌ను విడుదల చేసిన
ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ నేడు డెట్ ఫండ్‌ను విడుదల చేసింది , ఇది కస్టమర్లు ప్రస్తుత అధిక వడ్డీ రేట్లలో తమ పెట్టుబడులను లాక్-ఇన్ చేయడానికి, దీర్ఘకాలిక సంపదను నిర్మించడానికి మరియు ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి వీలు కల్పిస్తుంది. ప్రస్తుత వడ్డీ రేటు విధానం కస్టమర్‌లకు డెట్ ఫండ్‌లో పెట్టుబడి పెట్టడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుంది. ఐసిఐసిఐ పి ఆర్ యు కాన్‌స్టంట్ మెచ్యూరిటీ ఫండ్ జీవిత బీమా మార్కెట్లో ఇటువంటి మొదటి ఫండ్. వడ్డీ రేట్లు గరిష్ట స్థాయికి చేరుకోవడంతో, వడ్డీ రేట్లలో ఏదైనా తగ్గుదల కస్టమర్లకు పెట్టుబడి ఎంపికగా రుణ సాధనాలను ఆకర్షణీయంగా చేస్తుంది. రుణ సాధనాల ధరలు మరియు వడ్డీ రేట్ల మధ్య సంబంధం దీనికి కారణం వడ్డీ రేట్లు తగ్గినప్పుడు వాటి ధరలు పెరుగుతాయి, తద్వారా పెట్టుబడి పెట్టిన వినియోగ దారులకు ప్రయోజనం చేకూరుతుంది. కంపెనీ ఫ్లాగ్‌షిప్ యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్ తో పెట్టుబడులకు ఈ ఫండ్ అందుబాటులో ఉంది.

హెట్రో గ్రూప్ 10 డెస్క్ టాప్ కంప్యూటర్లు వితరణ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుండి హెట్రో గ్రూప్ ఆఫ్ కంపెనీ ప్రతినిధులు జిల్లా పోలీస్ కార్యాలయంలో 10 డెస్క్ టాప్ కంప్యూటర్ లు సుమారు దీని విలువ ?6,50,000/- విలువ కలిగినవి, అనకాపల్లి జిల్లా పోలీసులకు పరిపాలన అవసరమైన కంప్యూటర్లను జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ కుఅందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పి వి.సుబ్బరాజు,హెట్రో కంపెనీ చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి ఆదేశాల మేరకు కంపెనీ ప్రతినిధులైన వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కుల్లాయి రెడ్డి, జి.ఎం ఫైనాన్స్ సుబ్బారెడ్డి, సి.ఎస్.ఆర్ హెడ్ సుధాకర్, హెచ్‌ఆర్ సీనియర్ జి.ఎం రాజా రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సెక్యూరిటీ ఎన్.ఎస్.ఎన్. మూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు పతి వేణుగోపాల శర్మ శత జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - యలమంచిలి : ప్రముఖ కవి,ఆధ్యాత్మిక వేత్త, పురాణ ప్రవచకులు, అష్టావధాని, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదులు, సాహిత్య రత్న, విద్యాభాస్కర బిరుదాంకితులైన వాటన్నింటితో పాటుగా ముఖ్యంగా యలమంచిలి, పరిసర ప్రాంతాల్లో హిందీ మాష్టారుగా పని చేసి ఎంతో మంది విద్యార్థులకు హిందీ భాషను సులభమైన, సరళమైన పద్ధతిలో బోధించిన వ్యక్తి పతి వేణుగోపాల శర్మ శత జయంతి ఉత్సవాలను నేడు కొత్తపేట రామాలయంలో నిర్వహిస్తున్నట్టు ఆయన కుమారుడు జగన్నాథ శర్మ, శిష్య బృందం, యలమంచిలి గీతా ప్రచారకులు శిష్ట సోమ యాజులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు సంభందించిన సమాచారం గల వెబ్ సైట్ ని ప్రారంభించనున్నారు. మాష్టారు శిష్య బృందం, గ్రామస్తులు ప్రతీ ఒక్కరూ ఈ ఉత్సవాలలో పాల్గొనాలని వారు కోరారు.

స్నేహితుని అకాల మరణం.. కుటుంబానికి
స్నేహ బృందం ఆపన్న హస్తం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : చిన్న నాటి స్నేహం... అనుకోకుండా అనారోగ్యంతో అకాల మరణం వార్త కుటుంబంతో పాటు స్నేహితుల బృందంను కలిచి వేసింది. వివరాలలోకి వెళ్తేపదవ తరగతి 2000 బ్యాచ్ జడ్పీఎస్ వి. ఆర్. పురంలో తమతో చదువుకున్న వద్దాణపు శ్రీను ఇటీవలే అనారోగ్యం తో చనిపోయారు.స్నేహితుడి కుటుంబాన్ని ఎంతో కొంత భరోసా ఇవ్వాలని ఆలోచన రావటమే మిత్రులందరూ కలిసి కొంత ఆర్థిక సహాయం (రూ.20,000) స్నేహతుని భార్య, పిల్లలకు ఈ రోజు (గురువారం)అందిచటం జరిగింది. పిల్లలు చదువుల విషయంలో అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తాము అనే ధైర్యం కుటుంబానికి ఇవ్వటం జరిగింది. స్నేహితుని కుటుంబం ఆపదలో ఆదుకున్న మిత్ర బృందాన్ని అభినందిస్తూ మండల ప్రజలు ఇది చాలా మంచి విషయం ఇంకొందరి మిత్రులకు ఇలాంటి విషయాలలో ఆదర్శంగా ఉంటుందని కొనియడారు.

స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర - పద్మనాభం : ఆనందపురం శాఖా గ్రంధాలయం నందు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఈ రోజు (18-5-2023) స్టోరీ లిషనింగ్ (కథలు వినడం), స్టోరీ రైటింగ్ (కథలు రాయడం), స్టోరీ టెల్లింగ్ (కథలు చెప్పడం) కార్యక్రమం లతో పాటు విద్యార్థులు - పొదుపు అను అంశం పై ఆనందపురం బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఎంఎస్ ఎచ్ కృష్ణ బాలబాలికలకు అవగాహన కలిపించారు వారు ప్రసంగిస్తూ బాలలు పొదుపు చేయడం నేర్చుకోవాలని కోరారు తద్వారా వారి పై చదువు లకు పొదుపు చేసిన మొత్తం అవసరానికి పనికి వస్తుంది అని, చిన్న మొత్తాల పొదుపు దేశానికి మదుపు అని కనుక బాలబాలికలందరు పొదుపు అలవాటు చేసుకోవాలని కోరారు బాలికలకు సుకన్యా సంవృద్ధి పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలిపారు అలానే ఉత్తరములు రాయడం ద్వారా దూర ప్రాంతాలలో ఉన్న మన ఆప్తుల యోగ క్షేమాలు తెలుసుకోవచ్చని అన్నారు ఈ సందర్భంగా బాలబాలికలకు పోస్టుకార్డులు ఉచితం గా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో 25 మంది బాలబాలికలు, గ్రంధాలయ సిబ్బంది మరియు గ్రంధాలయాధికారి బివిఎస్ అప్పారావు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

20వ తేదీన ఐదవ తరగతి, ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష



విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గల గురుకుల పాటశాలలో ఐదవ తరగతి, రాష్ట్రంలో గల గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, డిగ్రీ మొదటి సంవత్సం"లలో ప్రవేశానికి ఈ నెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ప్రవేశ పరీక్షల నిర్వహణకు, విజయ నగరం జిల్లా తాటిపూడి గురుకుల పాటశాల ప్రిన్సిపాల్ వి.వి.రాజేంద్ర ప్రసాద్‌నుగా పరీక్షల సమన్వయకర్తగా నియమించినట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా రెవెన్యూ అధికారి పి అంబేద్కర్, జిల్లా విధ్యాశాఖాదికారి సలీం భాషాల పర్యవేక్షణలో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి 494 మంది, ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 1132 మంది దరఖాస్తు చేసుకున్నారని కలక్టర్ వివరించారు. ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష పాడేరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాటశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ కళాశాల రెండు కేంద్రాలలో ఉదయం 10.00 గంటల నుండి 12.00 గంటల వరకు జరుగుతుందని, ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష పై రెండు కలాశాలలతో పాటు, పాడేరు ప్రభుత్వ ఉన్నత పాటశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, తలారిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాటశాల (బాలురు) లలో మధ్యాహ్నం 02.30 గంటల నుండి 05.00 గంటల వరకు జరుగుతుందని కలక్టర్ వివరించారు. ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సబంధిత వెబ్ సైట్ నుండి హాల్ టికట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. కాగా ప్రవేశ పరీక్షకు ఒక గంట ముందుగా అభ్యర్థులు వారి వారి పరీక్షా కేంద్రాలలో హాజరు కావాలని కలక్టర్ కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య
మతిస్థిమితం లేకనే అంటున్న గ్రామస్తులు

విశాలాంధ్ర - చింతపల్లి : మతిస్థిమితం లేని వ్యక్తి కొండ ప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని చెరపల్లి గ్రామానికి చెందిన నామాల నర్సింగరావు (42) గత కొన్నేళ్లుగా మతిస్థిమితం లేకుండా గ్రామాలలో సంచరించడమే కాకుండా 2018లో ఒకరోజు అటవీ ప్రాంతంలో బస చేశాడని, అదేవిధంగా 2022లో కూడా సుమారు 5 రోజులు పాటు అదే అటవీ ప్రాంతంలో బస చేసిన సందర్భాలు ఉన్నాయని, అదే కోవలో గడిచిన నాలుగు రోజుల నుంచి చెరపల్లి గ్రామ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో బస చేసి ఉండవచ్చునని గ్రామస్తులు భావించారని అన్నవరం ఎస్సై పి సాయికుమార్ వివరించారు. గడిచిన వారం రోజులుగా గ్రామంలో నర్సింగరావు కనిపించడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. మతిస్థిమితం లేని వ్యక్తి ఎక్కడో, ఏదో గ్రామంలో సంచరిస్తూ ఉండి ఉంటారు లే అని గ్రామస్తులు భావించారని ఆయన తెలిపారు. అటవీ ప్రాంతానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లిన కొంతమంది యువకులు, గ్రామస్తులకు సమాచారం చేరవేయడంతో గ్రామస్తులు హుటా హుటీనా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోలీస్ స్టేషన్ కి ఫిర్యాదు చేశారని, మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం శవ పంచనామ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

జగనన్న విదేశి విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : జగనన్న విదేశీ విద్యాదీవెన పథకమునకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ , కాపు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పథకం అర్హత విద్యార్థిని, విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటును అందిస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ వారు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, పీహెచ్ డి, ఎంబీబీఎస్ కోర్సుల్లో ఏదైనా 21 కేటగిరీల సబ్జెక్టుల్లో చదువు తున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకొనవచ్చును. అంతర్జాతీయంగా 50 యూనివర్శిటీ/ కాలేజీలలో ప్రపంచ దేశాలలోని నూతన జాబితా క్యుఎస్ లేదా టైమ్స్ 5 ఎడ్యుకేషన్ వారి ప్రపంచ ర్యాంకింగ్ 2023 ప్రకారం సుమారు 379 యూనివర్శిటీ, చదువుతున్న విద్యార్థులు అర్హులు. కనుక అర్హత కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఫై చేయగలరు. విద్యార్థులు క్వాలిఫయింగ్ పరీక్షలో 60 శాతం మార్కులు కలిగి ఉండాలి. ఎస్ దరఖాస్తు చేసుకొనుటకు విద్యార్థులు నీట్ పరీక్షల్లో తప్పనిసరిగా క్వాలిఫై అయి. కెను. ఈ పథకానికి అర్హత కలిగి ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 100 ట్యూషన్ ఫీజు లేదా రూ.125 లక్షలు ఏది తక్కువైతే అది, ఇతర కళాశాల విద్యార్థులకు "తం ట్యూషన్ ఫీజు లేదా రూ.100 లక్షలు ఏది తక్కువైతే అది చెల్లిస్తారు.

ఈ పథకానికి లు వారి వార్షికాదాయం రూ.8 లక్షలలోపు, విద్యార్థి వయస్సు నోటిఫికేషన్ నాటికి 35 కౌలు లోపు ఉండవలెను. ఈ దరఖాస్తులను http:///www.jnanabhumi.ap.gov.in వెబ్ సైన్ ద్వారా జూన్ 10వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి తెలిపారు.

ఇద్దరు విద్యార్థులు గల్లంతు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని నరవ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థులు గురువారం గల్లంతయ్యారు. ఉదయం పరీక్షలు రాసిన మళ్ళ రాజేష్, (17) బందారు నిఖిల్, (17) అనే పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు సేద తీరేందుకు కాలేజీ వెనుక వైపున గల నీటి గుంటలో దిగారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు రాజేష్ నీటిలో మునిగిపోతుండగా గమనించిన నిఖిల్ తోటి మిత్రులకు ఫోన్ చేసి రాజేష్ మునిగిపోతున్నాడని చెప్పాడు. ఆ వెంటనే మిగతా విద్యార్థులు సంఘటనా స్థలానికి వచ్చే సమయానికి రాజేష్ తో పాటు నిఖిల్ కూడా కనిపించకుండా పోయాడు. రాజేష్ ని కాపాడే ప్రయత్నంలో నిఖిల్ కూడా నీటిలో మునిగిపోయి ఉంటాడని సంఘటనా స్థలంలో ఉన్న దుస్తులు కాలేజీ బ్యాగ్ ఆధారంగా భావిస్తున్నారు. కాలేజీ యజమాన్యం సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పెందుర్తి పోలీసులు గజ ఈత గాళ్లని రప్పించి గాలింపు చేపట్టారు. గల్లంతైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్తనాదాలతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.